వంటలను పరీక్షించాకే విద్యార్థులకు వడ్డించాలి

అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్

వంటలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 28 :వసతి గృహాల్లు, గురుకులాల్లో విద్యార్థులకు అందించే భోజనాన్ని తిని పరీక్షించాకే విద్యార్థులకు వడ్డించాలని అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం డివిజన్ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వంటగది, సరుకులు, కూరగాయలు, వంటలను పరిశీలించారు. వంటను నాణ్యమైన సరుకులు, కూరగాయలు ఉపయోగించాలన్నారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వంట కార్మికులు, భోజన ఇన్‌చార్జి ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. వంటలను ముందుగా ఇద్దరు, లేదా ముగ్గురు తిని చూశాకే విద్యార్థులకు వడ్డించాలన్నారు. పలు చోట్ల విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ వల్ల అస్వస్థతకు గురయ్యారని, అలాంటి ఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, సూపరింటెండెంట్ శంకరమ్మ, పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

జనగామలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జనగామ, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ)/ జనగామ చౌరస్తా, నవంబర్ 28 : మాగనూరు జడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనం వికటించి 29మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటనను నిరసిస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఏబీవీపీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. గురుకులాలు, వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనకు బాధ్యులైన వారిపై ప్రభుత్వ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ యాకన్న, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్‌సాయి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్తీక్, నితీశ్, వంశీ, మహేందర్, రోహిత్ పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి : రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా కొనసాగడంతో విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి పొదల నాగరాజు అన్నారు. మాగనూరు ఘటనను నిరసిస్తూ మండల కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు రాస్తారోకోను విరమింపజేశారు. అనంతరం లవకుమార్ మా ట్లాడుతూ వాంకిడి ఘటనలో విద్యార్థిని చనిపోయినా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. మాగనూరు ఫుడ్‌పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి ఘటన కారకులను కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మామిడాల రమేశ్, కం దుకూరి వంశీ తేజ, గొడుగు రమేశ్, మాలి, సాయి, ఆర్యా, నిషిత, సమంత తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి, చిల్పూరు సమావేశాల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

పాలకుర్తి : మాట్లాడుతున్న పసునూరి నవీన్

నేటి 'దీక్షా దివస్'ను విజయవంతం చేయాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య
- గ్రామాల్లో సన్నాహక సమావేశాలు
- నేడు జిల్లా కేంద్రానికి భారీగా తరలిరావాలని పార్టీ శ్రేణులు, అభిమానులకు పిలుపు

రఘునాథపల్లి, నవంబర్ 28 : జనగామ జిల్లా కేంద్రంలో చౌరస్తా వద్ద ఈనెల 29న (నేడు) శుక్రవారం నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగు క్లస్టర్లు ఏర్పాటు చేసి ఇన్‌చార్జీలను నియమించినట్లు తెలిపారు. మండలం నుంచి సుమారు 3వందల పై చిలుకు నాయకులు, కార్యకర్తలు తరలివచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి అనుగుణంగా ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో మండల ఇన్‌చార్జి వై కుమార్ గౌడ్, మండల కో-ఆర్డినేటర్ ముసపట్ల విజయ్, తోటకూరి గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలి

చిల్పూరు : మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో గురువారం మండల ఇన్‌చార్జి మాలోత్ రమేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజయ్య పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆరూరి స్వామి, ఆరూరి రవిచంద్ర, ఇల్లందుల వెంకట్ స్వామి, ఎడ్ల యాకన్నా, తేజ కుమార్, పవన్, రాజు పాల్గొన్నారు.

లింగాలఘనపురం : కిష్టగూడెంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

స్వచ్ఛందంగా తరలిరావాలి

చినబోయిన రేఖ

జనగామ రూరల్ : దీక్షా దివస్‌కు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు చినబోయిన రేఖ తెలిపారు. గురువారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడోనని కఠోర దీక్షతో కంకణం కట్టుకొని దీక్ష చేశారన్నారు. ఈ రోజు కొత్త శకానికి నాంది పలికిన రోజు అని అన్నారు. తెలంగాణ అమరుల త్యాగాలు, జ్ఞాపకాలు, పోరాటాలను గుర్తు చేసుకుందామని తెలిపారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి..

పాలకుర్తి : జనగామ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కోరారు. గురువారం మండలంలోని మల్లంపల్లి, ముత్తారం గ్రామాల్లో కార్యకర్తలు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14ఏళ్లుగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రం కోసం దీక్ష చేపట్టి స్వరాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. మండల ప్రధాన కార్యద ర్శి మాచర్ల ఎల్లయ్య, కడుదుల కరుణాకర్‌రెడ్డి, కటారి పాపారావు, బానోత్ మహేందర్‌నాయక్, కమ్మగాని సుధాకర్, సలేంద్రశంకర్, పోశాల వెంకన్న, చింతకింది ఉపేందర్, కర్ర రవీందర్ పాల్గొన్నారు.

ప్రజల గుండె చప్పుడు దీక్షాదివస్..

లింగాలఘనపురం : జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించనున్న దీక్షా దివస్ తెలంగాణ ప్రజల గుండె చప్పుడని, కనీవినీ ఎరుగని రీతిలో జనప్రభంజనం ఉండాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దీక్షాదివస్ కోసం సన్నాహక సమావేశాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టగూడెంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగానికి సిద్ధమైన కేసీఆర్ నవంబర్ 29న దీక్ష చేపట్టి విజయం సాధించాడన్నారు. దీక్షా దివస్ కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు తరలివచ్చి పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశాల్లో మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, ఉడుగుల భాగ్యలక్ష్మి, గండి యాదగిరి, రాంచందర్, యాకన్న, గట్టగల్ల శ్రీహరి పాల్గొన్నారు.

దీక్షాదివస్‌ను జయప్రదం చేయాలి.

బచ్చన్నపేట : జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షా దివస్‌కు మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావాలని మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి కోరారు. దివస్‌కు వేలాదిగా తరలివచ్చి గులాబీ సత్తా చూపాలన్నారు.

గ్రంథాలయ చైర్మన్ చాంబర్‌లో స్థానిక ఎమ్మెల్యే ఫొటో లేకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధుల ఫొటోలు

జిల్లా గ్రంథాలయంలో స్థానిక ఎమ్మెల్యే ఫొటోకు చోటు లేదు

కాంగ్రెస్ పార్టీ వేదికగా మారిన చైర్మన్ చాంబర్

జనగామ చౌరస్తా, నవంబర్ 28: జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మారుజోడు రాంబాబు బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే ఆయన చాంబర్ రాజకీయ వివాదాలకు వేదికైంది. విజ్ఞానం ఫరిడవిల్లే గ్రంథాలయంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫొటోను విస్మరించి కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, భువనగిరి, వరంగల్ ఎంపీలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, కడియం కావ్యతో పాటు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని, రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రియాజ్ ఫొటోలను మాత్రమే ప్రదర్శనకు పెట్టారు. అంతేకాదు పాఠకులు కూర్చొని పేపర్లు చదివే గదిలో ఎక్కడా కూడా మహాత్మా గాంధీ ఫొటో కూడా పెట్టలేదు. కనీసం భారతదేశ గ్రంథాలయ పితామహుడుగా పేరొందిన శియాలి రామామృత రంగనాథన్ ఫొటో పెట్టకపోవడం మరీ విడ్డూరం అని అక్కడికి వచ్చిన పలువురు రాజకీయ, మేధావి వర్గాలు చర్చించుకున్నారు. సహజంగా గ్రంథాలయాల్లో జాతీయ నాయకులైన మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, శియాలి రామామృత రంగనాథన్, ముఖ్యమంత్రి ఎవరుంటే వారి ఫొటోలు మాత్రమే పెట్టుకోవడం ఇప్పటి వరకు ఆనవాయితీగా ఉంది.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

జఫర్‌గఢ్, నవంబర్ 28 : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యాతా ప్రమాణాలు పాటించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. మండలం లోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని, కిచెన్ షెడ్, పరిశుభ్రత, తరగతిగదులు, పాఠశాల ఆవరణ శుభ్రత, విద్యార్థులకు బోధిస్తున్న తీరు తదితర అంశాలను, రికార్డులను ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం అందిస్తున్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో అందించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షారోనీ, డీటీ ఖాసీంనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడిసిన ఐకేపీ ధాన్యం

తడిసి ముద్దయిన ధాన్యం రాశులు

చిల్పూరు, నవంబర్ 28 : మండలకేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలోని సన్న రకం ధాన్యం రాశులు వాటర్ పైపు లీక్ కావడంతో తడిసి ముద్దయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పలువురు రైతులు తాము పండించిన సన్నరకం ధాన్యాన్ని స్థానిక ఐకేపీ కొనుగోలు కేంద్రానికి అమ్మకానికి తీసుకువచ్చారు. బుధవారం రాత్రి వడ్లను బస్తాల్లో నింపి రైతులు తమ ఇళ్లకు వెళ్లారు. గురువారం ఉదయం వెళ్లి చూడగా వాటర్ పైపు లీకేజీ కావడంతో 10మంది రైతులకు చెందిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు తోట శ్రీనివాస్, తాళ్లపల్లి లింగయ్య, బోడ రాజయ్య, తాడగొని రవీందర్, కుమారస్వామి, సట్ల రాజయ్య, బోనగిరి కుమార్, గాదె వీరస్వామి కోరారు.

అందుబాటులో కార్పొరేట్ తరహా వైద్యం

జనగామలో ఆయుష్మాన్ ఆస్పత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా, బండా ప్రకాశ్


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన జనగామ పట్టణంలో కార్పొరేట్ తర హా వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట రోడ్డులో రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నాల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి ఆధ్వర్యంలో నెలకొల్పిన ఆయుష్మాన్ ప్రైవేట్ ఆస్పత్రిని మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునతో కలిసి ఆయన ప్రారంభించారు. అంతకుముందు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ కార్యక్రమంలో పాల్గొని ఆస్పత్రిలోని ప్రత్యేక విభాగానికి లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవాభావంతో వైద్యం అందించాలని సూచించారు.

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి

జఫర్‌గఢ్, నవంబర్ 28 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు గురువారం డిమాండ్ చేశారు. మండలంలోని తమ్మడపల్లి(జి)లో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను అరికట్టాలని రాజు డిమాండ్ చేశారు. వచ్చే నెల 27,28 తేదీల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలకు విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య, మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, నాయకులు సుధాకర్, రాజు, వేల్పుల రవి, రాములు, యాకయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

4న కొబ్బరికాయల విక్రయాలకు వేలం

అదే రోజు హుండీల లెక్కింపు : ఈవో వంశీ

లింగాలఘనపురం, నవంబర్ 28 : జీడికల్ ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు విక్రయించేందుకు డిసెంబర్ 4న వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో వంశీ తెలిపారు. ఆలయంలోని తన కార్యాలయంలో గురువారం ఈవో విలేకరులతో మాట్లాడారు. వేలంలో పాల్గొనే వారు రూ.50 వేలు ధరావత్ చెల్లించి పాల్గొనాలన్నారు. గతంలో ఈ వేలం ద్వారా రూ.2,02,000 ఆలయానికి ఆదాయం వచ్చిందని, ఈ పర్యాయం పాట ఆ పైనుంచి ప్రారంభమవుతుందన్నారు. వేలం దక్కిన వారు డిపాజిట్ కాకుండా వేలంలో సగం డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. అదే రోజున హుండీ లెక్కింపు ఉంటుందన్నారు. ఈ నెల 14న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 27న జరిగిన కార్యక్రమంతో ముగిశాయన్నారు. జాతర విజయవంతానికి కృషి చేసిన అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు, ఆలయ కమిటీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జనగామ ఉప్పలమ్మ దేవాలయ ఈవో కేకే రాములు, ఆలయ పూజారులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, సిబ్బంది రాజేందర్‌రెడ్డి, భరత్‌కుమార్, మల్లేశం, శంకర్ పాల్గొన్నారు.

పత్తి రైతు సంఘం రాష్ట్ర కో-కన్వీనర్‌గా చందునాయక్


చందు నాయక్

జనగామ, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లాకు చెందిన భూక్యా చందునాయక్ తెలంగాణ పత్తి రైతు సంఘం రాష్ట్ర కో-కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. ఈమేరకు జరిగిన రాష్ట్ర సదస్సులో పత్తి రైతుల సమస్యలపై భవిష్యత్ ఉద్యమ నిర్వహణ కోసం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ ప్రకటించారు. ఈ సందర్భంగా చందునాయక్ మాట్లాడుతూ పత్తి రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా జిల్లా నుంచి తెలంగాణ రైతు సంఘం పట్టణ కార్యదర్శిగా పనిచేస్తున్న మంగ బీరయ్యను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే కడియం

ఘనంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణ స్వీకారం


బాధ్యతలు స్వీకరిస్తున్న రాంబాబు, పక్కన ఎమ్మెల్యే కడియం

జనగామ చౌరస్తా, నవంబర్ 28 : వచ్చే ఏడాదిలోపు జనగామలో అన్ని వసతులతో కూడిన డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి కృషి చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం స్థానిక వీవర్స్ కాలనీ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మారుజోడు రాంబాబు ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మె ల్యే కడియం శ్రీహరి, విశిష్ట అతిథులుగా రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రియాజ్, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో అన్ని వర్గాల ప్రజలకు, పాఠకులకు, నిరుద్యోగులకు, విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే విధంగా రూ.2లేదా రూ.3కోట్లతో డిజిటల్ లైబ్రరీ నిర్మిస్తామని తెలిపారు. అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అదేవిధంగా లైబ్రరీ నిర్మాణం కోసం ఇప్పటికే 2ఎకరాల స్థలాన్ని జిల్లా కలెక్టర్ కేటాయించగా అది ప్రజలకు అందుబాటులో లేదని తెలిపారు. అన్ని వర్గాల వారికి ఉపయోగకరంగా ఉండే విధంగా మరోచోట కలెక్టర్ ఒక ఎకరం లేదా 2ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. చివరగా నూతన చైర్మన్ రాంబాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్ వంగ కల్యాణి మల్లారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వేముళ్ల సత్యనారాయణరెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ కంచ రాములు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా

జనగామ మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్

జనగామ, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : రైతు సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28నుంచి 30వరకు నిర్వహిస్తున్న రైతు పండుగ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను రైతుల ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రైతు రుణ మాఫీ చేశామని, వివిధ కారణాలతో ఇంకా మాఫీ కాకుండా మిగిలిన అర్హులైన రైతులను ప్రభుత్వం గుర్తించిందన్నారు. వారికి కూడా త్వరలో రుణమాఫీ జరుగుతుందన్నారు. పంట పెట్టుబడి సాయంగా రైతు భరోసాను సంక్రాంతి పండుగ వరకు రైతుల ఖాతాల్లో జమచేస్తామని తెలిపారు.

నేడు అభివృద్ధి పనులకు స్థల పరిశీలన

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 28 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి మంజూరైన పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి నేడు ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్థల పరిశీలన చేయనున్నట్లు ఆర్డీవో డీఎస్ వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్, జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని, వాటి నిర్మాణానికి నేడు ఎమ్మెల్యే కడియంతోపాటు కలెక్టర్ స్థల పరిశీలన చేసిన అనంతరం అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహిస్తారని ఆర్డీవో తెలిపారు.

స్టేషన్ ఘన్‌పూర్, జఫర్‌గఢ్‌లో రథయాత్రకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

హిందూ చైతన్య రథయాత్రకు ఘనస్వాగతం

స్టేషన్ ఘన్‌పూర్/జఫర్‌గఢ్, నవంబర్ 28 : స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి జంట పట్టణాలతోపాటు జఫర్‌గఢ్ మండలంలోని ఉప్పుగల్లు, కూనూరు, కోనాయిచలం, జఫర్‌గఢ్, తిమ్మంపేట తదితర గ్రామాలగుండా సాగిన హిందూ చైతన్య రథయాత్రకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ రథయాత్రకు ముఖ్యఅతిథిగా ధర్మ జాగరణ జిల్లా సంయోజక్ జివిలికపల్లి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. హిందూ చైతన్యమే సకల మానవాళికి శ్రీరామ రక్ష అన్నారు. దేశంలో నానాటికీ హిందూ జనాభా తగ్గుతుందని ఆయన అన్నారు. సనాతన హిందూ ధర్మ విలువలను, సంస్కృతిని పిల్లలకు చిన్ననాటి నుంచే నేర్పించాలన్నారు. లవ్, ఫుడ్, బిజినెస్, ల్యాండ్ తదితర జిహాద్‌ల నుంచి హిందువులను అప్రమత్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీలు, కులాలు, ప్రాంతాలు, వర్గాలకు అతీతంగా హిందువులను చైతన్య పర్చడమే రథయాత్ర ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. కార్యక్రమంలో ధర్మ జాగరణ కార్యకర్తలు దాంశెట్టి సోమేశ్వర్, బోనగిరి శ్రవన్‌కుమార్, గందె సోమన్న, పుస్కురి సోమేశ్వర్, హరి శంకర్, చేగొండ రమేశ్, కమల, శ్రావ్య, మాధవి, సమతా, ఉమ, వాసవి, భాగ్యలక్ష్మి, సరోజన, అక్షింతల పద్మ, నాగభూషణం పాల్గొన్నారు.

ఎనీమియా రహిత తెలంగాణకు కృషి

దేవరుప్పుల, నవంబర్ 28 : ఎనీమియా లక్షణాలుంటే బాల్య దశలోనే తగు చర్యలు తీసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని ఆర్‌బీఎస్‌కే వైద్యులు రజనీకాంత్, వనజ అన్నారు. సింగరాజుపల్లి పాఠశాలలో గురువారం ఎనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనీమియాపై పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లల్లో రక్తహీనత వల్ల అనేక పరిణామాలు సంభవిస్తాయని అన్నారు. ఆకుకూరలు, అన్ని రకాల కూరగాయలు, మొలకలు, పాలు తీసుకుంటే ఎనీమియా నివారణ జరుగుతుందన్నారు. విద్యార్థులకు హెచ్‌బీ లెవల్స్ పరీక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంబటి అంజయ్య, సుచిత్రాఅనంత్, చైతన్య, సునీత ఉన్నారు

మున్నూరుకాపు సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా గుజ్జుల రాజు

జనగామ, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : మున్నూరుకాపు సంఘం జనగామ జిల్లా యూత్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గుజ్జుల రాజును నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ జారీ చేసిన ఉత్తర్వు పత్రాన్ని గురువారం జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులతోపాటు మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్ల రాజు పటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని ధర్నా

జనగామ, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : ఐఎస్‌ఐ నాణ్యాతా ప్రమాణాలు పాటించకుండా, అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా వెలిసిన వాటర్ ప్లాంట్లను సీజ్ చేసి, పట్టణ ప్రజలకు సురక్షిత మంచి నీటిని సరఫరా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జనగామ మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మున్సిపల్ వార్డులకు మంచినీటిని అందించే చీటకోడూరు రిజర్వాయర్ ఫిల్టర్‌బెడ్‌ను ఆధునీకరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నిర్లక్ష్యం వీడి ప్రజలకు రక్షిత నీటిని అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. లేదంటే మున్సిపల్ కార్యాలయ ముట్టడిస్తామని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ హెచ్చరించారు.

ఘనంగా మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి

జనగామ చౌరస్తా/నర్మెట, నవంబర్ 28 : అఖండ అక్షరయోధుడు, సామాజిక వైతాళికుడు మహాత్మ జ్యోతిబాపూలే 134వ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ యువజన సంఘం, బీసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల్లో అక్షర జ్యోతి వెలిగించిన మహనీయుడు జ్యోతిబాపూలే అని కొనియాడారు. జనగామలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు కిశోర్, సందెన రవీందర్, తాళ్లపల్లి కుమార్, బిర్రు నగేశ్, ఉదయ్‌కిరణ్, గువ్వల రవి, సుద్దాల కుమారస్వామి, కొలిపాక సమ్మయ్య, ముక్క నర్సింగరావు, రాము, మధు, సోమరాజు, శ్రీనివాస్, జోయేల్, సాయికుమార్, ఉమేశ్, అరవింద్, ప్రభాస్, వినీత్, హరిప్రసాద్, అరుణ్, విన్ను, భాస్కర్, తేజ పాల్గొన్నారు. నర్మెటలో అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు పల్లె ప్రభుదాస్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల శ్రీధర్, ప్రజ్ఞపురం శ్రీధర్, ఎనుగుల రాజు, గడ్డం సురేశ్, కంతి చరణ్‌కుమార్, చుంచు రాజు, చెవుల పరశురాములు, మహేశ్, ఇమ్మడి గాల్‌రెడ్డి, రవి, రాజు, కరుణాకర్, ఆంజనేయులు, సన్ని పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయంలో

జడ్జి పూజలు

పాలకుర్తి, నవంబర్ 28 : మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి వారి ఆలయాన్ని గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మహబూబాబాద్ ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి రవీందర్‌శర్మ దంపతులు దర్శించుకున్నారు. కార్తిక మాసం సందర్భంగా స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటయ్య, అర్చకులు డీవీ ఆర్ శర్మ, అనిల్, నాగరాజు, ఎస్సై లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MUDIDE RAJITHA W/o. TEJESHWAR (New Name), previously called BARUPATI RAJITA (Old Name), and R/o. H.No. 6-6-9/D, Saraswathi Nagar, Road No. 3, Sai Nagar Colony, Gopalpur, Hanamkonda Mdl, Hanumakonda Dist, 506009, TG, India, and solemnly declare. NTW-000

I, SHASHINDHAR E, R/o. 5-109, Gollawada, Thirumalagiri, Regonda Mdl., Jayashankar Bhupalpally-506 348, TS. Changed My Name as ENDLA SHASHIDHAR, S/o. Endla Cheralu. NT-326825

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

10/10 జీపీఏ సాధించాలి

- కలెక్టర్ రిజ్వాన్‌బాషా
- పాలకుర్తి కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ
- వంట నిర్వాహకులపై కలెక్టర్ ఆగ్రహం

పాలకుర్తి : కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

పాలకుర్తి, నవంబర్ 28 : ప్రతి రోజు విద్యార్థినులు గంటన్నరపాటు గణిత సాధన చేసి 10/10జీపీఏ వందశాతం సాధించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వంట గదిని పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనాన్ని పరిశీలించారు. కలెక్టర్ వంట నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంట పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. అభ్యాస దీపికను కచ్చితంగా అనుసరించాలన్నారు. వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. అలాగే ప్రత్యేక తరగతులు నిర్వహించి వారంలో నాలుగు రోజులు గణితాన్ని సాధన చేయాలన్నారు. ఆయన వెంట డీపీఆర్వో పల్లవి, తహసీల్దార్ పీ శ్రీనివాస్, ఆర్‌ఐ రాకేశ్, హెచ్‌ఎం బీ నవీన ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్ల వివరాలు ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలి...

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోళ్ల వివరాలను ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం పాలకుర్తి మండలంలోని అయ్యంగారిపల్లి, ముత్తారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు 41.300కిలోల ధాన్యాన్ని కాంటా పెడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 41కిలోలు మాత్రమే కాంటా వేయాలని సూచించారు. రైతులు అరబోసిన ధాన్యంను తేమ శాతాన్ని పరిశీలించారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న సర్వే డేటా ఎంట్రీని పరిశీలించారు. డేటా ఎంట్రీని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ పీ శ్రీనివాస్, ఎంపీడీవో ఆవుల రాములు, ఆర్‌ఐ రాకేశ్, ఏపీఎం పిట్టల నరేందర్, సీసీ వెంకటేశ్వర్లు, రైతులు బొమ్మగాని భాస్కర్, కర్ర రవీందర్, మండల చంద్రయ్య, కూనూరు కృష్ణమూర్తి, పొడిశెట్టి స్వామి ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

జనగామ చౌరస్తా, నవంబర్ 28 : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం జనగామ పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబురాల పేరిట పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ రిజ్వాన్ బాషా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పట్ల ఆసక్తి పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో 36టీమ్‌లు పాల్గొని తమ ప్రతిభకనబర్చారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి 4టీమ్‌లను ఎంపిక చేశారు. ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమం విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ ఏడునూతల, తెలుగు మాధ్యమం విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ లింగాలఘనపురం, ప్రభుత్వ గురుకుల ఆంగ్ల మాధ్యమం విభాగం టీజీఎంఎస్ లింగాలఘనపురం, ప్రైవేట్ ఆంగ్ల మాధ్యమం విభాగంలో ఏకశిల పబ్లిక్ స్కూల్ జనగామను ఎంపిక చేశారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చివరగా జన విజ్ఞాన వేదిక ప్రచురించిన 'జీవ పరిణామం' పుస్తకాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో ఎం రమేశ్, నిట్ ప్రొఫెసర్ కాశీనాథ్, డీటీవో గంటా రవీందర్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్, ఉమాదేవి, మర్రెడ్డి, చంద్రశేఖర్‌రావు, శోభన్‌రెడ్డి, శ్రీనివాసచారి, శోభన్, లక్ష్మణ్, బాలరాజు, సుధీర్‌రెడ్డి, సత్తయ్య, కృష్ణ, హన్మంతరావు, నాగరాజు పాల్గొన్నారు.